పురుషులకు ప్రత్యేకం

# రాంగ్ నంబర్




— ఆదూరి వెంకట సీతారామమూర్తి

నామట్టుకు నాకే ఆశ్చర్యం వేసింది.

ఎన్నడూ ఏ పుస్తకాన్నీ అంత శ్రద్ధగా చదవని నేను అన్నివందల పేజీలున్న ఆ నవలని రెండు మార్లు ఆమూలాగ్రం ఎలా చదివానో, చదివి యిష్ట పడ్డానో యిప్పటికీ ఆశ్చర్యమే.

ఇన్నేళ్ళొచ్చి నా హాబీలేమిటంటే - స్నేహితులతో గడపడం; సినిమాలూ, షికార్లూ; రేడియో వినడం - టీవీ చూడ్డం - ఇవే - అంతకుమించి ఎప్పుడూ ఏ పుస్తకమూ చదివిన పాపాన పోలేదు. చిన్నప్పుడు హైస్కూల్లో చదివేటప్పుడు సెలవుల్లో ఏదైనా పుస్తకం చదవమని నాన్నగారు 'సాహసగాధలున్న పుస్తకాలిస్తే ఆయన ఇంట్లో వున్నంతసేపూ పేజీలు తిప్పి, బొమ్మలు చూసి ఆయనటు వెళ్ళగానే పుస్తకాన్ని ఓమూల పారేసి స్నేహితులతో ఆటకి వెళ్ళిపోయే వాడిని.

కాలేజీ చదువు వెలగబెట్టినా అదృష్టవశాత్తూ ఆ కాలేజీ లైబ్రరీలో విద్యార్థులకు పనికొచ్చే ఒక్క పుస్తకమూ వుండేదేకాదు - అంచేత లైబ్రరీ పుస్తకం తీసుకుని చదివే బాధలేకుండా పోయింది -

ఇక ఉద్యోగమొచ్చాక పైన చెప్పిన హాబీలే తప్ప పుస్తక పఠనం ఎప్పుడూ లేదు.

అటువంటిది కల్పన చెప్పడంతో పుస్తకాలు అద్దె కిచ్చే షాపులో ఆ పుస్తకం అద్దెకు తీసుకు మరీ చదవాల్సివచ్చింది.

కల్పన నా స్నేహితురాలే కాదు. కొద్దిరోజుల్లో నా జీవిత భాగస్వామిగా కూడా కాబోతోంది. అందుకే ఆమె మెచ్చుకున్న పుస్తకాన్ని చదవక తప్పలేదు - మొదటిసారి ఆమె మెప్పుకోసమే ఆ నవల చదవా లనుకున్నాను - అయితే ఒకమారు చదివాక అందు లోని సహజమైన వర్ణనలూ కళ్ళకు కట్టినట్లుండే ఆ సంఘటనలూ, ఆశ్చర్యాన్ని కలిగించే మలుపులూ నన్ను నిజంగానే ఆకట్టుకున్నాయి. అందుకే వారంరోజుల్లోనే మళ్ళీ తెచ్చి చదవాలని పించింది—

ఆ నవలా రచయిత రవిచంద్రమూర్తి గురించి కల్పన చాలా గొప్పగానే చెప్పింది - తెలుగునాట చెప్పుకోతగ్గ మొదటి పదిమంది రచయితల్లో అత నొకడట - రచయితగా పరిచయమైన సుమారొక అయిదేళ్ళలోనే ఓ యిరవై వరకూ నవలా రాజాల్ని రాసేసి, అశేషాంధ్ర పాఠకుల్నీ ఆకట్టుకుని, వారి అభిమానాన్ని చూరగొన్నాడట. ఈ ఉపోద్ఘాతంతోనే అసలు నేనా నవలను చదవడానికి ఉపక్రమించింది.

ఎటువంటి రచనకైనా చదివించే గుణం ప్రధానం. తర్వాత ఆ రచనద్వారా విజ్ఞానంతో పాటు కొంత మనోవికాసం కూడా పాఠకుడికి కలగాలి - రచనలో రచయిత చెప్పే సందేశం వుండాలి - ఇలా కల్పన చెప్పిన విషయాలన్నీ రవిచంద్రమూర్తి నవలలో వున్నట్లు నా కన్పించింది—

అయితే ఆ నవల నన్నెంతలా ఆకట్టుకుందంటే రెండుమార్లు చదవడమే కాకుండా ఆ రచయిత అభిమానిగా మారిపోయి ఆయన నవలలు ఒకదాని తర్వాత మరొకటి చదువుతూ, రచయిత తెలివి తేటలకు ఉప్పొంగిపోతూ చివరకి అతని ఎడ్రసు సంపాదించి ఆయనతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే స్థితికొచ్చాను.

రచయిత రవిచంద్రమూర్తిలో నన్ను గొప్పగా ఆకర్షించిన విషయం ఆయన మేధస్సు - మేధస్సు అనేకంటే జ్ఞాపకశక్తి అంటే బావుంటుందేమో! నవల నడిపించడంలో; పాత్రలను ప్రవేశ పెట్టడంలో రచయిత చూపించిన చాకచక్యం కొత్తగా వుంటుంది - ప్రతి పాత్రనూ సహజరీతిలో మల్చి ఆ పాత్ర లేకపోతే కథ కుంటుబడేదేమో అన్పించేలా తీర్చిదిద్దారు - అరవై ప్రకరణాలుగా విభజించిన ఆ నవలలో రెండవ ప్రకరణంలో ప్రవేశ పెట్టబడిన ఓచిన్న పాత్రను సైతం యాభైనాలుగో ప్రకరణంలో తిరిగి ప్రవేశపెట్టి ఓ సంఘటనద్వారా ఆ పాత్ర ఔచిత్యాన్ని నిరూపించి, ఆ పాత్రకు న్యాయాన్ని చేకూర్చారు - అలాగే తొమ్మిదో ప్రకరణంలో జరిగిన ఓ చిన్న సంఘటన చివరి ప్రకరణంలో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది - ఇలా ప్రతి చిన్న విషయంలోనూ రచయిత మేధ, జ్ఞాపకశక్తీ చదువుతున్న వారికి 'అబ్బా' అనుకునేలా చేస్తాయి.

ఈ కారణాల చేతనే నేనతనికి అంత త్వరగా అభిమానినయ్యాను—

రవిచంద్రమూర్తికి నేనురాసిన మొట్టమొదటి ఉత్తరానికి వారం రోజుల లోపే జవాబు వచ్చింది. అది చూసి ఎంత ఆనందపడిపోయానో! నేను మరింత ఆనందించే విషయం మరొకటి జరిగింది-

నేను యిష్టపడ్డ ఆ నవల త్వరలో సినీమాగా రాబోతోందట - ఆ విషయంపై నా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ రవిచంద్రమూర్తికి ఉత్తరం కూడా రాసేను. ఆయనతో స్వయంగా మాట్లాడాలని వుందనే నా కోర్కెను ఆ ఉత్తరంలోనే బహిర్గతం చేసేను.

సుమారొక నెల తర్వాత ఆయననుండి రిప్లై వచ్చింది - నా సంతోషానికి హద్దేలేకుండా పోయింది-

ఆ సినీమా షూటింగు మా వూళ్ళోనే నట - తనొచ్చినపుడు తప్పక కల్సుకోవచ్చునంటూ రాశాడు—

మరో నెలరోజుల్లోనే మా వూళ్ళో ఆ సినిమా షూటింగు మొదలయింది.

రవిచంద్రమూర్తి ఆ చిత్రానికి మాటలు సమ కూరుస్తున్నారు - ఆయనుండే తేదీల వివరాలు తెల్సుకుని ఓరోజు ఉదయమే హోటల్‌కి వెళ్ళాను. నేననుకున్నంత హడావుడిగా లేదక్కడ. పేరు చెప్పి అడిగేసర్కి రూంనంబరు చెప్పింది రిసెప్షనిస్టు - ఆయన రూంలోనే వున్నట్లు చెప్పిందామె.

గది తలుపు గడియ పెట్టిలేదు. రెండుమార్లు తలుపు తట్టి తెరచి లోపలికి తొంగి చూశాను—

"ఎవరూ?" అంటూ లోపల్నుంచి గొంతు వినిపించింది—

ధైర్యంగా లోపలికి అడుగుపెట్టేను. చాల పెద్దగది - ఏ.సి. రూం కావడంవల్ల చాలా చల్లగావుంది. గదికి మధ్యలో డబుల్‌కాట్ మంచం వుంది. ఎన్నో పుస్తకాలలో ఆయన ఫొటో చూసి వుండటాన మంచంమీద శాలువా కప్పుకుని పడుకున్న వ్యక్తిని రవిచంద్రమూర్తిగా గుర్తించడానికొట్టేసేపు పట్టలేదు నాకు—

నాపేరు, వివరం చెప్పి పరిచయం చేసుకున్నాను.

సీన్ డిస్కస్ చేస్తూ రాత్రి చాలా పొద్దుబోయి పడుకున్నారట. సాయంకాలం వస్తే మాట్లాడుకోవచ్చు అన్నారు.

నాకెందుకో ఆయన నన్ను గుర్తించలేదని పించింది. ఆమాటే అడిగాను "నన్ను గుర్తించారా" అని—

ఈమాటు ఆయన ముఖం అదోలా మారింది— నిజానికాయన నన్ను గుర్తించలేదు—

"సారీ. రాత్రి నిద్రలేకపోవడం వల్ల అనీజీగా వుంది. సాయంకాలం రండి. మాట్లాడుకుందాం"

అన్నారు.

ఎంతైనా తెలుగువారి అభిమాన రచయిత. ఆయనకు వందలకొద్దీ అభిమానులుండొచ్చు - వారిలో నేను గుర్తు లేకపోవడంలో ఆశ్చర్యంలేదు - కానీ వారం రోజుల క్రితమే వచ్చే తేదీలనూ యితర వివరాలనూ తెలిపి కలుసుకోమన్న ఆయనే గుర్తించకపోవడం కాస్త ఆశ్చర్యమే అన్పించింది—

రాత్రి డిన్నర్ చేసిన నబ్జక్టు ప్రభావంకూడా కొంత వుండి వుండొచ్చని సరిపెట్టుకున్నాను. నాపేరూ, వివరాలూ మళ్ళీ చెప్పేను.

ఈమారు గుర్తొచ్చినట్టు నవ్వి "మీరా. నా ఉత్తరం అందిందన్నమాట" అంటూ కూర్చోబోయారు.

"మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నందుకు సారీ. సాయంకాలం వస్తాను" అన్నాను.

"తప్పకుండా రండి" అని ఆయన అంటూంటే వచ్చేశాను.

** ** **

అనుకున్నవి అనుకున్నట్టే జరిగితే యీ కథలన్నీ ఎందుకూ?

విపరీతమైన వర్షం—ఇంట్లో అనుకోని అతిధులూ మరో మూడురోజుల వరకూ నేను వెళ్ళలేక పోయాను.

ఏకొద్దిమందికోగాని రాని అవకాశం. అభిమానించే రచయితను కల్సుకుని మాట్లాడ్డం - నాకొచ్చింది. అయితే ఏం లాభం? నేవెళ్ళే సరికే యూనిట్ అంతా వెళ్ళిపోయినట్టు తెల్సింది - నిరాశ పడిపోయాను.

"మళ్ళీ వచ్చే అవకాశముందా" అనే నా ప్రశ్నకు ఆశాజనకమైన సమాధానమే వచ్చింది హొటల్ రిసెప్షనిస్టు నుంచి—

సినిమా చిత్రీకరణ పూర్తవలేదనీ; మరో ఇరవై రోజుల్లో ఆ యూనిట్ అంతా వస్తారనీ తెల్సింది.

డేట్సు తీసుకుని ఈమారు ఖచ్చితంగా రచయిత రవిచంద్రమూర్తిని కల్సి నేను రానందుకు క్షమాపణలు కోరి మాట్లాడాలనుకున్నాను—

ఆరోజు రానేవచ్చింది—

ఆఖరి షెడ్యూలుకోసం వచ్చిన రవిచంద్ర మూర్తిని కల్సాను—

పైజామా, సిల్కులాల్చీ, అందమైన క్రాపూ — అచ్చం రచయితలాగే వున్నారాయన. ఈమారు ఆయనతో ఆయన స్నేహితుడెవరో కూడా వున్నారు రూంలో. మాటలు ఆపి నావంక చూశారు రవిచంద్ర మూర్తి.

నేను ఆయనను చూసి పలకరింపుగా నవ్వేను—

ఎవరన్నట్టు చూశారాయన నావంక. నిజంగా నీరుగారిపోయాను.

ఏ రచయిత జ్ఞాపకశక్తికీ, రచనాశక్తికీ అబ్బురపడి అతనిని అభిమానించానో, ఆ రచయితే పరిచయమైన వ్యక్తిని ఇరవై రోజుల వ్యవధిలో మర్చిపోయి కొత్తగా చూస్తే అవమాన మనిపించింది.

నాపేరు చెప్పి "నేనెవరో గుర్తించారా" అన్నాను ఆశచావక.

"ఆఆ గుర్తొచ్చింది. వేషం గురించి డైరక్టర్ గారికి రికమెండ్ చేయమని క్రితంసారి వచ్చారు కదూ—" అని తలతిప్పేసి,

"నా నెక్ట్స్ పిక్చర్‌లో చూద్దాంలెండి" అని తేల్చేశారు.

నేనేం తక్కువవనదల్చుకోలేదు—

"మీరు... రవికిరణ్ ఏజెన్సీస్ మేనేజర్ చంద్రశేఖర్‌కాదా? నేను వారితో పనుండి వచ్చాను. సారీ" అంటూ వచ్చేశాను—

నావంక ఆయన చూసిన చూపు నేనెప్పటికీ మర్చిపోలేను.

# మతిమరుపా? బాధపడకండి!



"మీ పేరు ఏమన్నారు" అని అడుగుతారు పేరు చెప్పిన రెండు నిమిషాలకే కొందరు.

"అన్నపూర్ణాలోనేగదూ మీరు దిగింది. రూమ్ నంబర్ ఎంత" అని అడిగి 451 అంటే 541 అని బుర్రలో రికార్డు చేసుకొని, అన్నపూర్ణా హొటల్‌కి వెళ్ళి 145 ఏ ఫ్లోర్‌లో వుందో తెలుసుకుని 154 రూమ్ తలుపు తట్టారు మరికొందరు.

బజారులో కారు పార్కు చేసి షాపింగ్ పూర్తిచేసి కారు ఎక్కడ పార్కు చేశారో వెతుక్కుంటారు ఇంకొందరు.

నువ్వుల నూనె కొనడానికి వెళ్ళి వేరుశనగ నూనెకొని తెచ్చి ఆముదం తాగిన మొహం పెట్టారు కొందరు.

ఇవన్నీ జ్ఞాపకశక్తి లేక జరుగుతున్నవేనా? "నేను ఎందుకు గుర్తుపెట్టుకోలేకపోతున్నాను" అని చిన్న విషయాలు మరచిపోతున్నవారు ఒక్కసారి ఆలోచిస్తే...

మరచిపోవడం చాలా సాధారణమైన విషయం. సహజమైన విషయం. "క్రిందటి వారం ఏం జరిగిందో మరచిపోయాను" అంటారు కొందరు. 'మరచిపోయాను' అని చెప్పగలగడమూ జ్ఞాపకానికి సంబంధించిన విషయమేగదా!

ఉద్యోగాలకి వెళ్ళే స్త్రీలు, పిల్లల తల్లులు, వ్యాపారవేత్తలు సాధారణంగా చిన్నచిన్న విషయాలు మరచిపోతూవుంటారు. ఉతికిన బట్టలు ఇస్త్రీచేయడం, కళ్ళజోడు పెట్టిన చోటు, నెయిల్ కట్టర్ పెట్టిన ప్రదేశం... ఇవే వీ రు మరచిపోయే విషయాలు. ఇటువంటి చిన్నచిన్నవి మరచిపోయే వీరు పెద్ద సంగతులు ఎలా గుర్తువుంచుకోగలరు. అదే గొప్ప విషయం.!

కొంతమంది 'నాకు జ్ఞాపకం వుండదు' అంటారు. అసలు విషయం ఏమిటంటే అలా చెప్పేవారు ఇతరులు చెప్పే విషయాన్ని వినిపించుకోరు. వినవలసిన సమయంలో మనసుని ఇంకోచోట నిలుపుతారు. ఒకేసారి నాలుగు విషయాల గురించి ఆలోచించే వారు చిన్న విషయాన్నే గుర్తుంచుకోలేరు. అలాగే విపరీతమైన తలనొప్పి, భరించలేని కడుపునొప్పి వున్నప్పుడు ఇతరులు చెప్పే విషయాలు వినాలని ఆసక్తి వుండదు.

వయసు పెరుగుతూ వుంటే జ్ఞాపకశక్తి తగ్గుతుంది అంటారు. కాని వయసులో వున్న వారికీ ఈ సమస్య వుంది. హోమ్‌వర్క్ చెయ్యడం మరచిపోయే పిల్లలు వుంటారు. అలాగే అనేక పనికిరాని విషయాలు జ్ఞాపకం వుంచుకునే పెద్దలు చిన్నవిషయాల మాటే మరచిపోతారు.

అందుకే జ్ఞాపకశక్తికి ఎప్పుడూ పదును పెట్టాలి. ఇదీ ఒక వ్యాయామమే. ఈ 'వ్యాయామం'లో మూడు భాగాలు వున్నాయి.

ఒకటి — **ఏకాగ్రత.** కావలసిన విషయం మీద ఎప్పుడూ దృష్టి నిలపాలి. ఆ విషయం ముఖ్యమయినదయి వుండాలి. అనవసరపు వాటికి ప్రాధాన్యత యిచ్చి కాలాన్ని వృధా చేసుకోవడం మంచిదికాదు. ముఖ్యమయిన విషయాలని చిన్న పుస్తకంలో 'నోట్' చేసుకోవడం అన్నివిధాలా ఉత్తమం.

రెండు — **ఊహించుకోవడం.** ఒక విషయం గురించి ఊహించుకుంటే దానిని గుర్తుపెట్టుకోవడం సులభం. అయితే ఊహించుకునేది స్పష్టంగా వుండి, దాని గురించి ఒక అవగాహన ఏర్పరచుకోవాలి.

మూడు — **జతచేయడం.** జ్ఞాపకం వుంచుకోదలచిన దానిని ఇంకొకదానితో జతచేయాలి. అది ప్రధాన విషయమయినప్పుడు జ్ఞాపకం వుంచుకోవలసినదీ సులభంగా వెంటనే గుర్తుకువస్తుంది. సూపర్‌మార్కెట్‌కి వెళ్ళాలని జ్ఞాపకం పెట్టుకుంటే, అక్కడికి వెళ్ళాక కావలసినవి వెంటనే గుర్తుకు వస్తాయి.

అలా సహజరీతులలో జ్ఞాపకశక్తిని కాపాడుకోవచ్చు. 'మతిమరుపు' అని అప్పుడూ ఎవరయినా అన్నా బాధపడనక్కరలేదు. అమెరికాలో ఒక ప్రసిద్ధ సంస్థ జ్ఞాపకశక్తిని కాపాడుకోడానికి, పెంచుకోడానికి ఒక 'మాత్ర' తయారుచేసింది. అన్నట్టు దానిపేరు ఏమిటి?... జ్ఞాపకం రావటంలేదు !

— తా. ప్ర.